


# విముక్తి

ఆచార్య కొలకలూరి ఇనాక్

సీత నోటి ప్లాస్టర్ తీశాడు రామప్ప. అది ఊడినచోట గం అతుక్కొనే ఉంది.

చేతుల ప్లాస్టిక్ వైర్ వదులు చేశాడు. అది జారిపోయి, చేతుల్ని వదిలేసింది. అవి కమిలిపోయాయి.

కాళ్ళ కట్లు విప్పాడు. అవి పుళ్ళు అయ్యాయి.

రెండు రాత్రుళ్ళు, ఒక పగలు సీత నోరు తెరవలేదు. అరవలేదు. ఏమీ తినలేదు. తాగలేదు. కదల్లేదు. చేయి కదపలేదు.

విముక్తి సీతకే కాదు, మంచానికి కూడా. మంచం దిగి మూలకు కూర్చుంది.

ఆమె వెల్లికిలా ఉండిపోయింది. వట్టె మంచం, పందిరి మంచం, పాతకాలం మంచం కోళ్ళకు కాళ్ళూ చేతులూ బందీలు.

విముక్తి అయినా మామూలుగా లేదు సీత. కాళ్ళూ చేతులు పీకుతున్నాయి. ఏమీ తినబుద్ధి కాలేదు.

అరుద్దామనుకొంది. అరవలేకపోయింది. అరచే ఓపిక లేదు. అరచి లాభం లేదు.

నిద్ర లేదు. రెండు రాత్రులు. వొళ్ళు హూనం హూనం అయింది. కళ్ళలో నీళ్ళు కళ్ళలోనే ఇంకిపోయాయి. శవం ఆకారం వచ్చేసింది.

చైతన్యశిఖరం లాంటి మనిషి, మురుగ్గుంటలాగా అయింది.

కువ్వ వద్ద అందం సీత, కురూవరాశిలాగా మారింది. దైన్యంగా మారిపోయింది.

ఏడుపు రాదు. కళ్ళు ఊరవు. ఊరట లేదు. రాయిలాగా అయింది. గుండె బండ అయింది.

భర్త గుర్తు కొస్తే, కన్న బిడ్డ తలవుకొస్తే గుండె కలుక్కుమంటుంది.

ఆమె అవసరం వాళ్ళ కెట్లా తెలిసిందో దొడ్డి చూపించారు.

ఇంటి వెనుక భాగం తెలిసిపోయింది. అప్పుడే తెలిసింది. పారిపోయే వీలులేదు.

రామప్పతో పాటు నలుగురు మగవాళ్ళు ఇంట్లో ఉన్నారు. వాళ్ళందరూ మర్యాదస్తులు. మంచి వాళ్ళు. ఏమీ చేయరు తనను. చేయలేరు. పనివాళ్ళు. రామప్ప యజమాని. రామప్ప చేయమన్న పని చేస్తారు. చెప్పటానికి నిమిషం పడితే చేయడానికి సెకెండు.

ముందు గదిలో ఏదో అలజడి. రాజు గొంతు. విలేకరి గొంతు. స్పష్టంగా వినిపించటం లేదు.

'నా పెళ్ళాన్ని నాకివ్వండి!' రాజు గొంతు.

'నీ పెళ్ళం నాకేం తెలుసు!' రామప్ప మాట.

'ఆమెను బైటికి పంపండి!'

'లోపల్లేరెవరూ!'

'ఉందో లేదో పోయి చూచి వస్తాను'

'పోతావా?'

'ఊఁ!'

'పోయి తిరిగి వస్తావా?'

పోవద్దని, పోయి బైటికి రాలేవని విలేకరి చెబుతున్నాడు.

రాజు నాటి రాముడు కాదు. పరాయివాడు కిడ్నాప్ చేసిన భార్యను తెచ్చి పరీక్ష పెట్టడు. ఏలుకొంటాడు.

సీత నాటి సీత కాదు. ఆమెకు శీలం పోలేదు. ఈమెకు మానభంగం అయింది. ఆమె అగ్ని పరీక్షకు నిలిచింది. ఈమె నిలవలేదు.

రామప్ప నాటి రావణుడు కాడు. బలవంతంగా తేవటంలో సమానమే. కానీ మానభంగం నాటి రావణుడు చేయలేదు. రామప్ప చేశాడు.

రావణుడు నీతిమంతుడు. సీత పొందు కోరినా మానభంగం చేయలేదు. అనుమతి అర్థిస్తూ అసలు ప్రేమికుడిలా నిరీక్షించాడు. రామప్ప అలా కాదు.

రామరావణ యుద్ధం వస్తే రాముడు సత్పురుషుడు గెలిచాడు. రావణుడు ఓడిపోయాడు.

రాజు రామప్ప యుద్ధం వస్తే రాజు నశిస్తాడు. రామప్ప జయిస్తాడు.

రావణుడు నశించేంత ధర్మాత్ముడు. రామప్ప నాశనంకాని దుర్మార్గుడు.

రామప్పలాగా రావణుడు ఓడిపోకపోతే రాముడి విజయం లేదు. సీత విముక్తి లేదు.

ఓడిపోయేంత పుణ్యాత్ముడు రావణుడు.

ముందు గదిలో రామప్పతో మాట్లాడే రాజు మాట వింది. నేనున్నాను అంది. అన్నాననుకొంది. అందామనుకొంది. అనలేకపోయింది. మాట పెగల్లేదు. వచ్చినట్లులేదు. మాట వాకిలి దాటలేదు.

సీత కదల్లేదు.

తన కోసం రాజు వెదుకుతున్నాడు.

బిడ్డ ఎలా ఉన్నాడో!

ఎడారిలో వాన. కళ్ళలో నీళ్ళు వానకురుస్తూనే వుంది.

బి.ఏ చదువుతున్న మూడేళ్ళు రాజు ప్రేమిస్తూనే ఉన్నాడు. ఏరికోరి పెళ్ళాడాడు. కట్నం కానుకలు ఇవ్వలేరని తెలిసి వద్దన్నాడు.

పెళ్ళితో పాటు బేంక్ క్లర్కు ఉద్యోగం వచ్చింది. పెళ్ళే ఉద్యోగం తెచ్చిందని అందరూ భావించారు. సీతే ఉద్యోగం. అందుకే భార్య విద్యావంతురాలు. అయినా ఉద్యోగం సద్యోగం వద్దు.

ఆమె అందగత్తె. నలుగురూ ఆమె అందం కళ్ళార్పకుండా, లొట్టలు వేస్తూ చూడకూడదు.

తన భార్య, తన సొంతం. తనకే సొంతం. మరొకరు కన్నెత్తి కూడా చూడకూడదు.

సీత కూడా పెళ్ళికి ముందు ఉద్యోగం అని ఉవ్విళ్ళూరేది. పెళ్ళయి పిల్లాడు పుట్టేసరికి భార్యగా తల్లిగా స్థిరపడడానికే నిశ్చయించుకొంది. ఆమె ఆనందానికి అవధులు లేవు.



**కొట్టటం, తన్నటం, కొరకటం, కాల్చటం రామప్పకిష్టం. శరీరం అంతా పుండయింది. వాడి మానభంగంతోనే తాను చనిపోతానని సీత అనుకొంది. కానీ చావలేదు. ఆరోగ్యం కొంత, వయస్సుకొంత, ఆకారం కొంత ఆమెను చావకుండా కాపాడాయి**

ఆమె కింకా పాతికేళ్ళు నిండలేదు. పెళ్ళయి మూడేళ్ళు. పిల్లాడు పుట్టి రెండేళ్ళు. బదిలీ అయి ఆవూరు వచ్చి రెణ్ణెల్లు. ఇల్లు దొరికి, కాపురం పెట్టి నెల.

అంతదూరం పోవద్దన్నారు బంధువులు. ఉద్యోగికి దూరమేమి, భారమేమి అన్నాడు రాజు. ఆ పేటలో ఇల్లు తీసుకోవద్దన్నారు అందరు. 'ఇల్లు బాగుంది. వసతి కుదిరింది. నీళ్ళు, కరెంటు అనుకూలం. రెంట్ తక్కువ. ఎక్కడయితేనేం' అని చేరిపోయాడు.

రాజుకా వూళ్ళో బంధువులు లేరు. మిత్రులు లేరు. తను కాక ఆ బేంక్‌లో ఉద్యోగులు ఐదుగురే! బదిలీకోసం ఎదురు చూస్తున్నవాళ్ళే వాళ్ళు. వాళ్ళు ఫేమిలీలు పెట్టలేదు. అందుకు అనేక కారణాలు చెప్పారు. చెప్పని కారణం రవికి అర్థం కాలేదు. అర్థమయ్యేనరికి చాలా జరిగిపోయింది. సీత కుమిలి కుమిలి ఏడుస్తూ ఉంది. ముందు గదిలో శబ్దం లేదు. రాజు వెళ్ళిపోయాడు. విలేకరి తీసుకొని పోయాడు. నిశ్శబ్దంలో శబ్దంలా రామప్ప వచ్చాడు. మనిషి కనబడితే సీత వణికి పోతుంది. వణుకూ పోతే వణికిస్తాడు.

'నీ మొగుడొచ్చాడు' సీత తల ఊపింది.

'వెళతాను.'

సీత ఆశ వడింది. కొడుకు గుండెల్లో కలుక్కుమన్నాడు. ముఖంలో కళ. లేచింది.

'ఊ!' అంది.

ఒక్కటే దెబ్బ, చెంప మీద. వళ్ళు రాలలేదు. తల గోడకు తగిలింది. చెంపదెబ్బ. గోడ దెబ్బ. చెంప వాచిపోయింది. అసలే నున్నటి ఎర్రటి బుగ్గలు. ఇంకా ఎర్రగా కమిలిపోయాయి.

'నా యిష్టం వచ్చినప్పుడు పంపుతాను. పోవటం నీ యిష్టం కాదు'

అంత బాధలోనూ పంపుతానన్న మాట ఎంతో ఊరట కలిగించింది.

ఎత్తుకొచ్చిన రోజు మానభంగం చేసి చంపుతారనుకొంది సీత. చంపలేదు. కానీ మానభంగం మరణంతో సమానం.

రామప్ప రాక్షసుడు కానిదే మానభంగం తృప్తి నిచ్చేట్టు లేదు. కొట్టటం, తన్నటం, కొరకటం, కాల్చటం రామప్పకిష్టం. శరీరం అంతా పుండయింది. వాడి మానభంగంతోనే తాను చనిపోతానని సీత అనుకొంది. కానీ చావలేదు. ఆరోగ్యం కొంత, వయస్సుకొంత, ఆకారం కొంత ఆమెను చావకుండా కాపాడాయి. ప్రతిఘటించిన కొద్దీ హింస పెరుగుతుంటే హింస వదిలించుకోవటానికి ప్రతిఘటించటం మాని మానభంగం అంగీకరించే స్థితికి వచ్చింది సీత. మానభంగం చేయని రావణుడెంత మంచి భగవంతుడు!

రామప్ప వందిరి మంచమెక్కితే పట్టపగ్గాలుండవు. క్లాసు ఒన్ రాక్షసుడు. లేకపోతే సామాన్యుడు. పిట్ట మనిషి. తంతే వది చోట్ల వడతాడు. కానీ తన్నటమే అసాధ్యం.

కట్టేయకుండా సీతను లొంగదీసుకొనే శక్తి రామప్పకు లేదు. ఆమె లొంగదు. వశం కాదు. లొంగిన మనిషిని కట్టివడేయటం అనవసరం. అందుకే బందీ నుంచి విడుదల. రాజు సౌకుమార్యం ముందు వీడే మూలక్కాడూ. రాజు చేతి గోరుకే పారేడే సామర్థ్యం తెలుసు. మీసం పైపెదవి మీద ఎంత హాయిగా గుచ్చుకొంటుంది. వీడికా సౌకుమార్యం సాధ్యమా? రాజు స్విచ్ వేస్తే గదంతా వెలుగుతుంది. వీడు వెలుతురు కోసం వళ్ళంతా కాలుస్తాడు. ఎంత తేడా!

వీడా మొగవాడు? కానీ తన భర్త తనను మళ్ళీ చేరదీస్తాడా? తప్పక ఆదరిస్తాడు.

రాజుకు తన గాయత్రి ఎంత ఇష్టమో. జంధ్యమెంత అభిమానమో, పిలకెంత ప్రాణప్రదమో, ప్రాణమెంత ముఖ్యమో, తనంత ముఖ్యం. తనకెప్పటికీ రాజు ప్రాణనాథుడు. సీత మంచం జైలు నుంచి గది జైలుకు మారింది. ఈ ఇంట్లో ఆమె చాలా వింది. చాలా తెలుసు కొంది.

రామప్పకు పాతి కేళ్ళుండవు. జానా బెత్తెడు మనిషి. ఇనపకడ్డీ. ఆరోగ్య వంతుడు. వికారి. శరీరమంతా క్రూరత్వమే. రామప్పను చూడ్డానికే కాదు, వినడానికి కూడా అసహ్యమే. బూతులేకుండా మాట ఉండదు. వాసన లేకుండా నోరుండదు. తాగకుండా మనిషి వుండడు. తాగందే మంచ మెక్కడు. మైకం లేందే రాక్షసుడు కాడు.

రామప్ప తండ్రి ఎం.పి. అన్న ఎంఎల్ఎ. రాజకీయంగా పలుకుబడి ఉన్న కుటుంబం. ఆర్థికంగా రాబడి ఎక్కువ. రాబడి మార్గంతో నిమిత్తం లేదు. తరతరాలుగా కుటుంబానికి పెద్దరికం. జిల్లాలో తిరుగులేని పెత్తనం.

ముఖ్యమంత్రి జిల్లాకు వస్తే ఆ ఇంట్లో భోజనం చేయకుండా పోవడానికి వీలులేదు. కలెక్టరు, యస్.పి. బదిలీ అయి జిల్లాకు వస్తే ఎలా మెలగాలో వాళ్ళింట్లో నేర్చుకొని పోతారు. జిల్లా యంత్రాంగమంతా వాళ్ళ కుటుంబం చెప్పినట్లు నడుచుకొంటుంది.

రామప్ప తండ్రికీ, అన్నకూ కావలసిన సేవలు చేస్తాడు. రామప్ప తండ్రికి రాముడు, అన్నకు లక్ష్మణుడు.

తండ్రి శత్రువుల్నీ, అన్న వగవాళ్ళను అంతం చేయటంలో అతడిది అందెవేసిన చేయి. తండ్రి కానీ, అన్న కానీ ఎన్నికల కోసంకూడా జిల్లాలోకి రావలసిన అవసరం లేదు. అన్నీ తానే చూడగలడు. సాధించగలడు.

రామప్ప, పాతికేళ్ళ వయస్సులో, ఏడేళ్ళ సర్వీసులో పది హత్యలయినా చేయించాడు. ఆచూకీ లేనివాటి మాటవేరు. పాతిక మానభంగాలయినా ఉంటాయి. అన్నీ వెలుగు చూడకపోయినా ఆమాత్రం బైట పడ్డాయి. వందదొమ్మీలు, వేయి దొంగతనాలు చేయించాడు.

రామప్ప ఖ్యాతి రాష్ట్రమంతా వ్యాపించింది. పోలీసుల లెక్కల్లోకి రాని కేసులు లెక్కేలేదు. తండ్రికి, అన్నకు రామప్ప ప్రఖ్యాతి తెలుసు. మందలించలేదు. ఎందువల్ల? వాళ్ళ అవసరాలు తీర్చే మనిషి! ఏమంటారు? డబ్బు కావాలన్నా, రామప్పదే పెత్తనం. ఎన్నికలొచ్చిన డిటో. వాళ్ళ ఉనికే రామప్ప మీద ఆధారపడిఉంది. ఒకరు ఢిల్లీని, మరొకరు హైదరాబాదును ఏలుకొంటుంటే రామప్ప జిల్లాను పరిపాలిస్తున్నాడు. తిరుగులేదు. జిల్లాలో అపోజిషన్ లేకుండా చేస్తానని, పర్మినెంటుగా తండ్రిని యంపిగా, అన్నను ఎంఎల్ఎగా ఉంచుతానని వాగ్దానం చేశాడు.

ఆధారపడ్డ వాళ్ళు ఏం మందలిస్తారు?

తన మాట వాళ్ళు వింటారు. మాట నెగ్గాలన్నా, పని జరగాలన్నా మనుషులుండాలి. మనిషి కావాలంటే జీతమివ్వాలి. జీతమివ్వాలంటే డబ్బు కావాలి. లెక్క సంపాదించాలంటే కోటి మార్గాలు. జిల్లానిండా డబ్బే! జనమంతా డబ్బే. అయితే ధర్మమార్గం! కాకపోతే అధర్మమార్గం. రామప్పకు దొంగతనాలు చేయించటం దోషం కాదు. నీతి. రాజనీతి!

ఎంత డబ్బయినా రానీ తానొక్క పైసా ముట్టడు. అంతా ప్రజల సొమ్మే!

తమ పొలాలు, పేక్టరీలు, కల్లుసారాయి దుకాణాల డబ్బుకూడా తాను ముట్టడు. బేంక్‌ల్లో ఉంచుతాడు.

తాను ముట్టేది ఆడవాళ్ళనే! అదొక్కటే రామప్ప సొంత ఇష్టం!

ఎప్పుడూ ఆడవాళ్ళుండాలి. ప్రతి పర్యాయం ఒకే ఒక్క ఆడమనిషి. వారం పది రోజులకంటే అక్కరలేదు. అది రూలు. పదేళ్ళ నుంచి పెత్తనం. నాటి నుంచే రామప్ప సొంత ఇష్టం.

బాతు బంగారు గుడ్డు కథ రామప్పకు తెలుసు. అది రాజుకోసం రోజుకొక్క గుడ్డే పెడుతుంది. ఒక్కరోజే పదిగుడ్లు పెట్టదు. కోస్తే ఒక్క గుడ్డుకూడా దొరకదు. అందుకే వారం పదిరోజులు ఆడవాళ్ళను తెచ్చి ఇంట్లో ఉంచుకోవటం. శరీరానికొక ధర్మం ఏడ్చిచచ్చింది కానీ, లేకపోతే పదిగుడ్లూ ఒకేసారి పెట్టించుకొని ఉండేవాడే రామప్ప.

సీత దగ్గర కుదరలేదు.

చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. రామప్పకు తల్లి ప్రేమ తెలియదు.

అందరికంటే పెద్దది అక్క. పెళ్ళయి వెళ్ళి మళ్ళీ రాలేదు. ఆమె తండ్రినీ, తమ్ముళ్ళనూ చూడలేదు. చూడదు. పలకరించదు. రాకపోకల్లేవు.

వంటావార్పూ కూడా ఆ ఇంట్లో మగవాళ్ళే.

రామప్పకు గాజుల చేతులు వడ్డిస్తే తినే అదృష్టం లేదు. ఏడుస్తూ వడ్డించే వాళ్ళంటే రామప్పకు కోవం. నవ్వుతూ సేవచేసిన ఆడమనిషి లేదు.

సీత నవ్వదు. కానీ ఏడవదు.

గ్లానులిస్తుంది. సోడాలిస్తుంది. బాటి లిస్తుంది. ఐసు ఇస్తుంది. అన్నీ చేస్తుంది. లేకపోతే హింస. హింస తప్పించుకోవటానికి సేవ. సేవనుంచి విముక్తి ఆశ. పారిపోయే మార్గం లేదు. బ్రతికే అవకాశం లేదు. అయినా రామప్ప కిడ్నాప్ చేసి తీసుకొని వచ్చిన ఆడవాళ్ళను చంపిన ఆనవాళ్ళు లేవు. అసలు పొగే లేదు.

ఏ ఆడమనిషి అయినా, ఎంత అందగత్తె అయినా పదిరోజులకు మార్చాల్సిందే! ప్రతి ఘటించకుండా, గింజు కోకుండా ఎదురు తిరక్కుండా ఉండే ఆడ మనిషి అంటే రామప్పకు ఇష్టం ఉండదు.

ఎదురు తిరగాలి. లొంగాలి. సేవ చేయాలి. పదిరోజుల్లో ఏ స్త్రీ అయినా వెళ్ళి పోవాలి. అదీ శాసనం. కానీ స్త్రీలను, లొంగిన వాళ్ళను చంపడు. రాజకీయ శత్రువుల్ని చంపుతాడు. ప్రత్యర్థుల్ని చంపిస్తాడు. డబ్బు కోసం చంపుతాడు. డబ్బు తీసుకొని ఖూనీలు చేయిస్తాడు.

కానీ, పక్కలో పడుకొన్న ఆడవాళ్ళ ప్రాణాలు వాళ్ళకే ఇస్తాడు. మానాలు తన దగ్గరుంచుకొంటాడు. అభిమానవంతుడు.

ఆడవాళ్ళకు వాడి శృంగారం హత్యతో సమానం. వేరే చావు ఎందుకు?

నా భార్యను రామప్ప కిడ్నాప్ చేశాడనీ, మానభంగం చేస్తున్నాడనా వారం రోజుల్నుంచీ రాజు కాలికి బలపం కట్టుకొని, పిల్లవాణ్ణి ఎత్తుకొని గడప గడపకూ తిరిగాడు, మొర పెట్టుకొన్నాడు.

బేంక్ వాళ్ళు రామప్ప అలాంటి మనిషి కాదని చేతులు దులిపేసుకున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఋజువులు కావాలన్నారు. రాజకీయ నాయకులతో చెప్పాడు. వ్యక్తి సమస్య మా సమస్య కాదు. వ్యవస్థ సమస్య మా సమస్య అన్నారు. మానవసంబంధాలు మా లక్ష్యం కానీ మానభంగం కాదన్నారు. ఆర్థిక సమస్యలు పరిష్కరిస్తాం కానీ, ఆడవాళ్ళ సమస్యలు కాదన్నారు. హిందూత్వం కాపాడతాం కానీ హిందూ స్త్రీలను కాదన్నారు. దేశ సౌభాగ్యం ముఖ్యం కానీ ఒక్క స్త్రీ సౌభాగ్యం కాదన్నారు. అయిందానికీ, కానిదానికీ సమ్మెలు బంద్‌లు, రాస్తారోకోలు చేసే విద్యార్థులు పరీక్షలు దగ్గరకు వచ్చాయన్నారు.

కలెక్టరు కాగితం తీసుకొన్నాడు. న్యాయం జరిగేలా చూస్తానన్నాడు.

యం.పి. అర్జీ తీసుకొన్నాడు. వెంటనే చర్య తీసుకోమని వ్రాశాడు. నిరభ్యంతరంగా మానభంగం ప్రతిదినం టైంటేబిల్ ప్రకారం జరిగిపోతూనే ఉంది. అన్యాయం అనే నోరు లేక మూగగా సీత రోదిస్తూనే ఉంది. కసాయి వాడి దయ మీద ఆధార పడి విముక్తి కోసం నిరీక్షిస్తూ ఉంది.

బిడ్డకు పాలిచ్చి వస్తానన్నా వినని సింహం దగ్గర సీత ఆహారంగా మిగిలి పోయింది. ఒక ఆడమనిషికి అన్యాయం జరిగింది. మీరైనా సాయం చెయ్యండి. నా భార్యను కాపాడండని స్త్రీ ఉద్యమ సంఘాలతో చెబితే మీటింగు పెడతామన్నారు. పెట్టలేదు. సమ్మె చేస్తా మన్నారు. చేయలేదు. చివరకు తేల్చి చెప్పారు. వాడు మమ్మల్ని ఏమైనా చేస్తే మాకేం గతి? నిజం చెప్పారు. వీళ్ళు- స్త్రీలే నిజానికి జనమ నేటట్లుగా సత్పురుషులు. నిజం చెప్పారు. నిజం చెప్పలేక, భయం విప్పలేక, వణికి పోతూ సిద్ధాంతాలు వల్లించిన ప్రబుద్ధులు కాదు వీళ్ళు.

నాలుగు లక్షల జనాభా ఉన్న ఊళ్ళో మూడు లక్షల ఓటర్లున్నచోట, ఉన్న ఒకే ఒక్క మగ వాడు విలేకరి. వార్తలు రాశాడు. రామప్ప కిడ్నాప్ చేసిన సీత ఆచూకీ ప్రచురించాడు. పరిశోధనాత్మక కథనాలు ప్రచురించాడు.

ప్రజలు చదివారు. సమ్మె చేయలేదు. ఊరేగింపు లేదు. ఖండించలేదు.

ఆ రోజు విలేకరిని పట్టుకొని వచ్చారు. నోటికట్లు విప్పారు.

'నువ్వేనా వార్తలు వ్రాసింది?'

'నేనే!'

'నేను రామప్పనని తెలుసా?'

'తెలుసు!'

'ఆమే నా సీత?'

'అవును'

'నిన్ను చంపితే ఏం చేస్తావ్?'

'నువ్వు చస్తావ్!' సీత వక్కకు పోబోయింది.

'ఆగు' రామప్ప గద్దించాడు. ఆగింది.

'చూడు' అన్నాడు చూచింది. 'నీకిది పాఠం' అన్నాడు. 'ఊ' అంది. 'చూనస్తూ ఉండు' చూస్తూ ఉంది.

విలేకరి కాళ్ళూచేతులూ పందిరిమంచం కాళ్ళకు కట్టారు. కదల్లేదు. నోట్లో గుడ్డలు కుక్కారు. నోరెత్తడు. విలేకరి గుండెల మీద కూర్చున్నాడు రామప్ప. దిండు తీసుకున్నాడు. ముఖం మీద వొత్తాడు.

'నా శత్రువు బ్రతకడు. శవం ఆచూకీ ఉండదు' అది కొందరికి వార్నింగు. కొందరికి పని పురమాయించటం.

'వెళతావా?' రెండురోజుల తర్వాత రామప్ప అడిగాడు. ఏమీ చెప్పలేదు. రెట్టించాడు. ఏడ్చింది. చంపుతానన్నాడు. ఏడ్పు మాని వేసింది. 'చెప్పు' అన్నాడు.

'ఊ' అంది.

'మాటలు వచ్చా?'

'రావు!'

'నోరుందా?'

'లేదు!'

'ఏమయినా చూశావా?'

'చూళ్ళేదు'

'ఎక్కడయినా ఏమైనా చెబితే విలేకరిని చూశావు కదా. అలా అయిపోతావు. విన్నావా? నాకేమీ కాదు. నన్నెవరూ ఏమీ చేయలేరు!'

సీత మౌనం.

'ఏం మాట్లాడవు?'

'నాకు నోరు లేదు!'

వింతగా చూశాడు.

రోజు అలసిపోయింది. పొద్దు పడమట కుంకింది. చీకటి ముసురుకొంది. ముందు గదిలో కదలిక. అలికిడి. మాటలు.

'నా భార్యను నాకివ్వు!'

'పంపిస్తాను. నువ్వింటికెళ్ళిపో!'

ముందుగదిలో నిశ్శబ్దం! అనుచరులు వెళ్ళిపోయారు. రామప్ప మిత్రుడితో కూర్చున్నాడు. సీత గ్లానులు పెట్టింది. తాగుతూ అడిగాడు.

'వెళతావా?' సీత మాట్లాడలేదు.

'నీ మొగుడొచ్చాడు!'

వింది మాట్లాడలేదు.

'వెళ్ళు!'

సీత చెప్పింది 'వెళ్ళను'

'వెళ్ళవా?'

'వెళ్ళను!'

'ఏం?'

'ఈ ఒక్కరాత్రీ ఇక్కడే ఉంటాను. రేపు తెల్లవారుజామున వెళతాను. ఎవరికంటాపడకుండా, ఎవరితో ఏమీ చెప్పకుండా' ముఖంలోకి ఎగాదిగా చూశాడు. మగతనం రొమ్ము విరుచుకొంది.

'నీ యిష్టం'

'ఒక కోర్కె' అర్థించింది.

'చెప్పు!'

'సిగరెట్టు కాల్చకూడదు'

రామప్ప మగతనం మళ్ళీ మేల్కొంది.

ఫుల్ బాటిల్ పూర్తయింది. భోజనం అయిపోయింది. మిత్రుడు వెళ్ళిపోయాడు.

'ఇవాళ అందంగా ఉన్నావ్' అన్నాడు.


'మీరు కూడా' అని సిగ్గు పడింది.

రామప్ప నవ్వాడు. పారపోయేట్టు నవ్వాడు. ఆగకుండా నవ్వాడు. తెరలు తెరలుగా నవ్వాడు. అతడి జీవితంలో అంత పెద్దగా నవ్వటం ఎవరూ వినలేదు. చూడలేదు. అనుకోలేదు. ఊహించలేదు.

తెల్లవారింది. ఇల్లంతా బార్లా తెరచి ఉంది.

సీత ఇంట్లో లేదు. రామప్ప మంచం మీద వెల్లికిలగా పడు కొన్నాడు. చేతులూ కాళ్ళూ కమిలిపోయి ఉన్నాయి.

తన పందిరి మంచం మీద, తన ఇంట్లో రామప్ప పడుకొని కదలటం లేదు విలేకరిలా.



**'ఈ ఒక్కరాత్రీ ఇక్కడే ఉంటాను. రేపు తెల్లవారుజామున వెళతాను. ఎవరికంటా పడకుండా, ఎవరితో ఏమీ చెప్పకుండా' ఆమె ముఖంలోకి ఎగాదిగా చూశాడు. రామప్ప మగతనం రొమ్ము విరుచుకొంది.**